'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

# రాజ్య సంస్కరణ

TGBIL/26/A6717 RAJYA SAMSKARANA తెలుగు దినపత్రిక

www.rajyasamskarana.com

'రాజ్య సంస్కరణ' ఈ-పేపర్ కోసం ఇక్కడ స్కాన్ చేయండి..

మేడ్చల్ మల్కాజిగిరి | సంపుటి : 1 | సంచిక : 67 | గురువారం | 22.10.2026 | పేజీలు : 8 | వెల రూ. 2

Medchal Malkajgiri | Volume: 1 | Issue: 67 | Thursday | 22.10.2026 | Pages: 8 | Rate: 2



## వద్దు నాన్న.. తప్పు

### ట్రంప్‌ను హెచ్చరించిన కొడుకు

**ఇరాన్ యుద్ధం వద్దంటూ వార్నింగ్**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో యుద్ధంలోకి అమెరికాను తీసుకెళ్లడంపై ఆయన పెద్ద కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ అసంతృప్తిగా ఉన్నట్లు ది అట్లాంటిక్ కథనం వెల్లడించింది. 2024 అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలోనే అమెరికా మరోసారి మధ్యప్రాచ్య యుద్ధంలో చిక్కుకోకూడదని డాన్ జూనియర్ భావించినట్లు సమాచారం. (వివరాలు 3లో..)



## అమరుల కుటుంబాలకు సర్కార్ భరోసా!

- పరిహారం భారీగా పెంపుపై సీఎం హామీ
- 2028లోగా ఖాళీల భర్తీ లక్ష్యమని వెల్లడి

పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావోద్వేగ ప్రసంగం చేశారు. సమాజ రక్షణ కోసం ప్రాణాలను అర్పించిన పోలీసు అమరులకు నివాళులర్పించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన దేవ్ సింగ్, ప్రమోద్ కుమార్, గాజుల సౌమ్య వంటి వారి త్యాగాలను గుర్తుచేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. అమరుల కుటుంబాలు తమకు ఆప్తులను కోల్పోయిన బాధను ఎవరూ తీర్చలేరని, అయితే ఆ కుటుంబాలు ఒంటరిగా లేవని భరోసా ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం, పోలీసు శాఖ, సమాజం ఎల్లప్పుడూ అమరుల కుటుంబాలకు అండగా ఉంటాయని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి శాంతిభద్రతలు కీలకమని, పోలీసుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.



2లో..



3లో..

## మతం మారితే ఓబీసీ రద్దే..!?

**• వెనుకబాటుతనమే కీలకమా? • సుప్రీం తీర్పుతో ఫుల్ క్లారిటీ**



## మైసూరు దసరా ఉత్సవాల్లో సీఎం

**జంబూ సవారీలో పాల్గొన్న రేవంత్**
**చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు**

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కర్ణాటకలో వైభవంగా నిర్వహించిన మైసూరు దసరా ఉత్సవాల్లో పాల్గొన్నారు. కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆహ్వానం మేరకు మైసూరు చేరుకున్న ఆయన, ముందుగా స్థానికుల ఆరాధ్య దైవమైన చాముండేశ్వరి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మైసూరు రాజభవనం ఎదుట నిర్వహించిన దసరా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్‌తో పాటు దేశ, విదేశాలకు చెందిన పలువురు ప్రముఖులతో కలిసి ఉత్సవాలను వీక్షించారు.

## నేడు కొడంగల్‌కు సీఎం రేవంత్ రెడ్డి

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేడు కొడంగల్‌లో పర్యటించనున్నారు. దసరా పండుగ సందర్భంగా స్థానిక ప్రజలు, ముఖ్య నాయకులకు శుభాకాంక్షలు తెలియజేసేందుకు అందుబాటులో ఉండనున్నారు. పర్యటనలో భాగంగా ఉదయం 10 గంటలకు మైసూరు నుంచి హైదరాబాద్ చేరుకోనున్న సీఎం, బేగంపేట విమానాశ్రయం నుంచి నేరుగా రవీంద్ర భారతికి వెళ్లనున్నారు. అక్కడ నిర్వహించే శ్రీ పండుగ సాయన్న ముదిరాజ్ జయంతి కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం మధ్యాహ్నం 12.30 గంటలకు వికారాబాద్ జిల్లా కొడంగల్ పట్టణానికి చేరుకుంటారు. అక్కడ స్థానిక ప్రజలు, ముఖ్యనాయకులను కలుసుకుని దసరా శుభాకాంక్షలు తెలియజేయనున్నారు. కొడంగల్‌లో పండుగ వేళ ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై ఆసక్తి నెలకొంది.



3లో..

## పూర్వీకుల త్యాగస్ఫూర్తితో పనిచేయండి

**జనసంఘ్ వారసత్వమే పార్టీ బలం**
**బీజేపీ శ్రేణులకు నితిన్ నబీన్ పిలుపు!**



3లో..

## సీజేపీ నేతలకు బెయిల్

**ఏడు రోజుల తర్వాత విడుదల**
**జంతర్ మంతర్ నిరసనలపై హామీ**




2లో..

## నెస్లే, కాంప్లాన్‌కు ఝలక్

**ఎఫ్ఎస్ఎస్ఏఐ నోటీసులు!**

**ప్రకటనలపై అనుమానాలు • ఆధారాలు చూపాలని ఆదేశం**




3లో..

## టీవీ ఛానళ్లకు కేంద్రం హెచ్చరిక

- విద్వేష ప్రసారాలపై కఠిన చర్యలు!
- ప్రసార నియమాలు పాటించాల్సిందే
- రెచ్చగొట్టే వ్యాఖ్యలకు మూల్యం తప్పదు

## పండుగొస్తే పండగేనా... !?



2లో..

- దసరా లిక్కర్ సేల్స్ అదుర్స్
- రూ. 2 వేల కోట్ల మందు దందా!
- 19 రోజుల్లోనే రికార్డు అమ్మకాలు
- బీర్లకు ఫుల్ డిమాండ్!

దసరా పండుగ వచ్చిందంటే తెలంగాణలో సంబరాలే కాదు.. మద్యం వ్యాపారానికీ భారీ పండగే! అక్టోబర్ మొదటి 19 రోజుల్లోనే రాష్ట్రంలో మద్యం డిపోల నుంచి సరఫరా అయిన స్టాక్ విలువ రూ.2,054.51 కోట్లకు చేరింది. గత ఏడాది ఇదే సమయానికి నమోదైన రూ.1,499.46 కోట్లతో పోలిస్తే ఏకంగా రూ.555.05 కోట్ల పెరుగుదల కనిపించింది. అంటే అమ్మకాల విలువలో 37.02 శాతం వృద్ధి నమోదైంది. పండుగకు ముందే దుకాణదారులు భారీగా స్టాక్ తెప్పించుకోవడంతో డిపోల వద్ద వ్యాపారం ఊపందుకుంది. అక్టోబర్ 19న ఒక్కరోజే రూ.303.40 కోట్ల విలువైన మద్యం సరఫరా కావడం ఈ జోరుకు నిదర్శనం. గత ఏడాది అదే తేదీన ఈ విలువ కేవలం రూ.33.64 కోట్లు మాత్రమే.



## గ్లోబల్ సమ్మిట్‌లో కళావైభవం

**ప్రపంచానికి తెలంగాణ ప్రత్యేకత**
**ప్రచారానికి మీడియా, సినీ ప్రముఖులు**
**పెట్టుబడుల వేదికపై సాంస్కృతిక సందడి**

తెలంగాణ చారిత్రక ఘనతను, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026ను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో జరగనున్న ఈ సమ్మిట్‌లో జానపద కళలు, శాస్త్రీయ సంగీతం, నృత్య ప్రదర్శనలతో పాటు రాష్ట్రంలోని విభిన్న సంప్రదాయ కళారూపాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. (వివరాలు 2లో..)



## జవహర్‌నగర్ కోసం ఈటల పాదయాత్ర

**డంప్ యార్డు తరలింపునకు సమరశంఖం!**

జవహర్‌నగర్ డంప్ యార్డును జనావాసాలకు దూరంగా తరలించాలని డిమాండ్ చేస్తూ మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ఉద్యమానికి సిద్ధమయ్యారు. ఉపగ్రహ సమాచారం ఆధారంగా మీథేన్ ఉద్గారాలు అధికంగా ఉన్న ప్రాంతాలపై వెలువడిన నివేదికలో జవహర్‌నగర్ డంప్ యార్డు ప్రపంచంలో నాలుగో స్థానంలో ఉన్నట్లు సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థులు తనకు వివరించారని ఆయన తెలిపారు. (2లో..)

# జహీరాబాద్ అభివృద్ధికి బ్రేకులు



వివరాలు5లో..

## రైతులకు పరిహారంలో అన్యాయం?

- కేంద్రం ఒక దారి.. రాష్ట్రం మరో దారి!
- కేంద్ర ప్రాజెక్టులకు రాష్ట్రం సహకారమేది?
- రైతులకు న్యాయం చేస్తేనే అభివృద్ధి సాధ్యం
- రియల్ ఎస్టేట్‌పై ప్రజల నమ్మకమే ఆర్థికానికి దన్ను

ఒకవైపు కోట్లాది రూపాయల పెట్టుబడులు.. మరోవైపు లక్షలాది రూపాయల విలువైన భూములు! పరిశ్రమలతో వేలాది ఉద్యోగాలు సృష్టించే అవకాశం.. రైతుల జీవితాలను మార్చే అభివృద్ధికి మార్గం! ఇంతటి బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాల్సిన పాలకులు మాత్రం ఎందుకు తడబడుతున్నారు? దేశవ్యాప్తంగా పారిశ్రామిక కారిడార్లతో కొత్త ఆర్థిక కేంద్రాలను నిర్మించాలన్న కేంద్రం లక్ష్యం ఒకవైపు ఉంటే, రాష్ట్రంలో కొత్త ప్రాజెక్టుల ప్రకటనలు మరోవైపు చర్చకు దారితీస్తున్నాయి. ఇప్పటికే నిమ్జ్, ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీతో పారిశ్రామికంగా ఎదిగే అవకాశమున్న జహీరాబాద్‌కు రావాల్సిన ప్రాధాన్యం ఎక్కడ? ఫ్యూచర్ సిటీపై దృష్టి సారించడం తప్పు కాదు.. కానీ ఉన్న అవకాశాలను నిర్లక్ష్యం చేయడం ఎంతవరకు సమంజసం? ఇక్కడే అసలు ప్రశ్న మొదలవుతోంది. మార్కెట్‌లో ఎకరా భూమి రూ.30 లక్షల నుంచి రూ.75 లక్షల వరకు పలుకుతుంటే, ప్రభుత్వ రిజిస్ట్రేషన్ విలువలు మాత్రం ఎంతో తక్కువగా ఉన్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. భూసేకరణలో రైతులకు న్యాయం జరగకపోతే ప్రాజెక్టులు ముందుకు సాగుతాయా? కేంద్రం-రాష్ట్రం మధ్య సమన్వయం కొరవడితే పెట్టుబడులు వస్తాయా? చివరకు నష్టపోయేది ఎవరు? అభివృద్ధి కోసం భూములా.. భూముల కోసం అభివృద్ధా..!?



# మైసూరు దసరా ఉత్సవాల్లో సీఎం

- జంబూ సవారీలో పాల్గొన్న రేవంత్
- చాముండేశ్వరి అమ్మవారికి ప్రత్యేక పూజలు



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కర్ణాటకలో వైభవంగా నిర్వహించిన మైసూరు దసరా ఉత్సవాల్లో పాల్గొన్నారు.కర్ణాటక ముఖ్యమంత్రి డీకే శివకుమార్ ఆహ్వానం మేరకు మైసూరు చేరుకున్న ఆయన, ముందుగా స్థానికుల ఆరాధ్య దైవమైన చాముండేశ్వరి అమ్మవారి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మైసూరు రాజభవనం ఎదుట నిర్వహించిన దసరా వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేరళ ముఖ్యమంత్రి వీడీ సతీశన్‌తో పాటు దేశ, విదేశాలకు చెందిన పలువురు ప్రముఖులతో కలిసి ఉత్సవాలను వీక్షించారు.

### బంగారు అంబారీలో అమ్మవారి వైభవం

మైసూరు దసరా ఉత్సవాల్లో ప్రధాన ఆకర్షణగా నిలిచే జంబూ సవారీలో బంగారు అంబారీలో కొలువుదీరిన చాముండేశ్వరి అమ్మవారి ఉత్సవమూర్తిని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దర్శించుకున్నారు.

అందంగా అలంకరించిన ఏనుగుపై అమ్మవారి విగ్రహాన్ని ఊరేగించడం వేడుకల్లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. కన్నడ సంస్కృతిని ప్రతిబింబించే జానపద కళాకారులు, సంగీత బృందాలు,నృత్యప్రదర్శనలు ఊరేగింపుకు మరింత శోభను తీసుకొచ్చాయి. కర్ణాటక రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన మైసూరు దసరా.. భారతీయ సంస్కృతి,సంప్రదాయాలు,భక్తి,కళలు, చారిత్రక వారసత్వానికి ప్రతీకగా నిలిచింది. ఈ వేడుకల్లో రేవంత్ రెడ్డి పాల్గొనడం రెండు రాష్ట్రాల ప్రముఖుల మధ్య సాంస్కృతిక సంబంధాలకు ప్రాధాన్యం చేకూర్చింది.

# అమరుల కుటుంబాలకు సర్కార్ భరోసా!

- పరిహారం భారీగా పెంపుపై సీఎం హామీ
- 2028లోగా ఖాళీల భర్తీ లక్ష్యమని వెల్లడి

పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భావోద్వేగ ప్రసంగం చేశారు. సమాజ రక్షణ కోసం ప్రాణాలను అర్పించిన పోలీసు అమరులకు నివాళులర్పించారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన దేవ్ సింగ్, ప్రమోద్ కుమార్, గాజుల సౌమ్య వంటి వారి త్యాగాలను గుర్తుచేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు చేస్తున్న సేవలు వెలకట్టలేనివని పేర్కొన్నారు. అమరుల కుటుంబాలు తమకు ఆప్తులను కోల్పోయిన బాధను ఎవరూ తీర్చలేరని, అయితే ఆ కుటుంబాలు ఒంటరిగా లేవని భరోసా ఇచ్చారు. తెలంగాణ ప్రభుత్వం, పోలీసు శాఖ, సమాజం ఎల్లప్పుడూ అమరుల కుటుంబాలకు అండగా ఉంటాయని స్పష్టం చేశారు. రాష్ట్ర అభివృద్ధికి శాంతిభద్రతలు కీలకమని, పోలీసుల సంక్షేమానికి తమ ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని తెలిపారు.

### పరిహారం పెంపుతో కుటుంబాలకు అండ

విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయే పోలీసుల కుటుంబాలకు అందించే పరిహారాన్ని ప్రభుత్వం గణనీయంగా పెంచిందని సీఎం వెల్లడించారు. కానిస్టేబుళ్లకు రూ.40 లక్షల నుంచి రూ.కోటి, హెడ్ కానిస్టేబుళ్లు, ఏఎస్ఐలకు రూ.45 లక్షల నుంచి రూ.కోటి, ఎస్ఐలకు రూ.45 లక్షల నుంచి రూ.1.25 కోట్లు, ఇన్‌స్పెక్టర్లకు రూ.50 లక్షల నుంచి రూ.1.25 కోట్లు, డీఎస్పీ, అదనపు ఎస్పీలకు రూ.50 లక్షల నుంచి రూ.1.50 కోట్లు, ఎస్పీ, ఐపీఎస్ అధికారులకు రూ.కోటి నుంచి రూ.2 కోట్లకు పరిహారాన్ని పెంచినట్లు వివరించారు. ఇది కేవలం ఆర్థిక సాయం కాదు.. అమరుల కుటుంబాలకు ప్రభుత్వం ఇచ్చే గౌరవం అని పేర్కొన్నారు. విధి నిర్వహణలో మరణించే హోంగార్డుల కుటుంబాలకు ప్రస్తుతం అందిస్తున్న రూ.5 లక్షల పరిహారాన్ని రూ.10 లక్షలకు పెంచాలని డీజీపీని ఆదేశిస్తున్నట్లు ప్రకటించారు. పోలీసు సిబ్బంది పిల్లలకు విద్యావకాశాలు కల్పించేందుకు యంగ్ ఇండియా పోలీస్ స్కూల్‌ను ప్రారంభించినట్లు తెలిపారు.

### • ఉద్యోగాల భర్తీ.. ఆధునిక సాంకేతికతకు ప్రాధాన్యం

పోలీసు శాఖలో మరో 5 వేల ఉద్యోగాల భర్తీకి చర్యలు తీసుకున్నామని, 2028లోగా అన్ని ఖాళీలను భర్తీ చేస్తామని సీఎం ప్రకటించారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 112 మంది డీఎస్పీలను నియమించామని తెలిపారు. ట్రాన్స్‌జెండర్లను ట్రాఫిక్ అసిస్టెంట్లుగా నియమించి వారి ఆత్మగౌరవానికి ప్రాధాన్యం ఇచ్చామన్నారు. మారుతున్న నేర స్వభావాన్ని ఎదుర్కొనేందుకు పోలీసు శాఖను ఆధునీకరిస్తూ ఆధునిక సాంకేతికతను వినియోగిస్తామని చెప్పారు. డ్రగ్స్, గంజాయి నియంత్రణలో ఈగల్ ఫోర్స్ పనితీరును అభినందించారు. కల్తీ ఆహారాన్ని అరికట్టేందుకు టీజీ సేఫ్ వ్యవస్థను తీసుకొచ్చామని వివరించారు. షీ టీమ్స్ సేవలను కొనసాగిస్తూ, మహిళల భద్రతకు స్టాండ్ విత్ హర్, స్పందన తక్షణ రక్షణ బృందాల ద్వారా మరింత బలోపేతం చేస్తున్నామని తెలిపారు.

### • ప్రజలకు భరోసా.. బాధితులకు సత్వర న్యాయం

మహిళలు, చిన్నారులకు సంబంధించిన కేసుల్లో పోలీసులు మరింత సున్నితంగా వ్యవహరించాలని, బాధితులకు న్యాయం అందించడంలో జాప్యం జరగకూడదని రేవంత్ రెడ్డి సూచించారు. మహిళల భద్రత పోలీసుల బాధ్యత మాత్రమే కాదని, సమాజంలోని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. సాంకేతికత ఎంత అభివృద్ధి చెందినా పోలీసుల్లో మానవీయ దృక్పథం తగ్గకూడదని స్పష్టం చేశారు. పోలీసుల క్రమశిక్షణే వారి బలం, నిజాయితీయే గౌరవం, ప్రజలకు కల్పించే భరోసాయే గొప్ప గుర్తింపు అని పేర్కొన్నారు. ప్రజల భద్రత కోసం పోలీసులు అంకితభావంతో పనిచేయాలని, వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంటుందని భరోసా ఇచ్చారు. అమరుల త్యాగాలను గౌరవిస్తూ, వారి ఆశయాలను కొనసాగిస్తూ శాంతియుతమైన, సురక్షితమైన, అభివృద్ధి చెందిన తెలంగాణ నిర్మాణానికి అందరూ కృషి చేయాలని ముఖ్యమంత్రి పిలుపునిచ్చారు.











# జవహర్‌నగర్ కోసం ఈటల పాదయాత్ర

**డంప్ యార్డు తరలింపునకు సమరశంఖం!**

బ్యూనస్ ఐరీస్, జకార్తా, కౌలాలంపూర్ తర్వాత జవహర్‌నగర్ పేరు రావడం ఆందోళనకరమన్నారు. మీథేన్ వాయువు గ్లోబల్ వార్మింగ్, వాతావరణ మార్పులకు ప్రధాన కారణాల్లో ఒకటి అని గుర్తుచేశారు. డంప్ యార్డు సమస్యపై అక్టోబర్ 23న బాధితులతో సమావేశం, 25నమేధావులు,పర్యావరణవేత్తలతోరౌండ్‌టేబుల్ సమావేశం నిర్వహించనున్నట్లు ప్రకటించారు. అక్టోబర్ 27 నుంచి డంప్ యార్డుకు వ్యతిరేకంగా పాదయాత్ర చేపట్టనున్నట్లు వెల్లడించారు.

### లక్షలాది మంది చెత్తకు ఒక్క ప్రాంతమేనా?

జవహర్‌నగర్ డంప్ యార్డును తొలుత రెండు లక్షల మంది జనాభా అవసరాల కోసం ఏర్పాటు చేశారని, ప్రస్తుతం సుమారు కోటి 60 లక్షల మందికి సంబంధించిన చెత్త అక్కడికి వస్తోందని ఈటల రాజేందర్ ఆరోపించారు. డంప్ యార్డు చుట్టూ 25 కిలోమీటర్ల పరిధిలో భూగర్భ జలాలు కలుషితమయ్యాయని, 30 కిలోమీటర్ల పరిధిలోని ప్రజలు దుర్వాసన, కాలుష్యంతో శ్వాసకోశ, చర్మ సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పేద కుటుంబాలు సంపాదించిన డబ్బును వైద్య ఖర్చులకే వెచ్చించాల్సి వస్తోందన్నారు. చెత్త నిర్వహణకు ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులో ఉన్నప్పటికీ, ప్రభుత్వం వాటిని సమర్థంగా వినియోగించడం లేదని విమర్శించారు. ఐఐటీ బాంబే రూపొందించిన సాంకేతిక పరిష్కారాలను పరిశీలించి అమలు చేయాలని, చెత్తను ఇతర ప్రాంతాలకు పంపిణీ చేసి జవహర్‌నగర్‌పై భారం తగ్గించాలని కోరారు.

### శాశ్వత పరిష్కారం కావాలి.. పాదయాత్రకు సిద్ధం

డంప్ యార్డు సమస్యపై అఖిలపక్ష సమావేశం జరిగినా శాశ్వత పరిష్కారం లభించలేదని ఈటల రాజేందర్ పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రకటనలకే పరిమితం కాకుండా, స్థానిక ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థుల పరిశోధనలో వెల్లడైన అంశాలను పరిశీలించి, నిపుణుల సూచనలతో కాలుష్యాన్ని తగ్గించే చర్యలు చేపట్టాలని కోరారు. జవహర్‌నగర్ ప్రజలకు ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించేందుకు జీరో పొల్యూషన్ లక్ష్యంగా ముందుకు సాగాలని సూచించారు. డంప్ యార్డు తరలింపు, చెత్త నిర్వహణలో మార్పులు, కాలుష్య నియంత్రణపై ప్రభుత్వాన్ని నిలదీసేందుకు ఈ నెల 27 నుంచి పాదయాత్ర చేపడతానని ప్రకటించారు. ప్రజల ఆరోగ్య సమస్యలకు శాశ్వత పరిష్కారం లభించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

# పండుగొస్తే పండగేనా..!?

- దసరా లిక్కర్ సేల్స్ అదుర్స్
- రూ. 2 వేల కోట్ల మందు దందా!
- 19 రోజుల్లోనే రికార్డు అమ్మకాలు
- బీర్లకు ఫుల్ అత్యధిక డిమాండ్!

అక్టోబర్ 19న ఒక్కరోజే రూ.303.40 కోట్ల విలువైన మద్యం సరఫరా కావడం ఈ జోరుకు నిదర్శనం.గత ఏడాది అదే తేదీన ఈ విలువ కేవలం రూ.33.64 కోట్లు మాత్రమే.

వామ్మో..ఒక్కరోజులోనే ఇంత తేడానా? అన్నంతగా గణాంకాలు కనిపిస్తున్నాయి.

బీర్లకు బంపర్ డిమాండ్..కేసుల లెక్క చూస్తే షాకే!

మద్యం సరఫరాలో బీర్లు ప్రత్యేకంగా దూసుకెళ్లాయి. అక్టోబర్ 1 నుంచి 19 వరకు రాష్ట్రంలో 30.37 లక్షల కేసుల బీరు సరఫరా కాగా, గత ఏడాది ఇదే సమయంలో 21.55 లక్షల కేసులు మాత్రమే నమోదయ్యాయి. అంటే బీరు సరఫరా ఏకంగా 40.93 శాతం పెరిగింది. ఇండియన్ మేడ్ ఫారిన్ లిక్కర్ (ఐఎంఎఫ్ఎల్) సరఫరా కూడా 14.16 లక్షల కేసుల నుంచి 18.38 లక్షల కేసులకు చేరి 29.80 శాతం వృద్ధి సాధించింది. అక్టోబర్ 19న ఒక్కరోజే 4.25 లక్షల కేసుల బీరు, 2.72 లక్షల కేసుల ఐఎంఎఫ్ఎల్ సరఫరా అయ్యాయి. బీరు కేసులు, మద్యం సరఫరా లెక్కలు చూస్తుంటే పండుగ సందడి డిపోల వద్ద ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. అయితే డిపోల నుంచి సరఫరా చేసిన మొత్తం స్టాక్ అంతా వినియోగదారులకు అమ్ముడైందని ఈ గణాంకాలు నిర్ధారించడం లేదు.

### చివరి రోజుల్లోనే అసలు జోరు.. లెక్కల్లో భారీ ఎగబాకుడు!

నెల మొదట్లో మద్యం సరఫరా వృద్ధి పెద్దగా కనిపించకపోయినా, పండుగ సమీపించే కొద్దీ లెక్కలు ఒక్కసారిగా మారాయి. అక్టోబర్ 7 నాటికి మొత్తం సరఫరా విలువ రూ.550.37 కోట్లుగా ఉండగా, అక్టోబర్ 16 నాటికి రూ.1,527.85 కోట్లకు చేరింది. అక్టోబర్ 17న మరో రూ.223.25 కోట్ల విలువైన మద్యం సరఫరా కావడంతో మొత్తం రూ.1,751.07కోట్లకు పెరిగింది. రెండు రోజుల్లోనే లెక్కలు రూ.2 వేల కోట్ల గడప దాటేశాయి. గత ఏడాది దసరా అక్టోబర్ 2న జరగగా, ఈ ఏడాది అక్టోబర్ 20న నిర్వహించారు. దీంతో పండుగకు ముందు స్టాక్ తెప్పించుకునే సమయం మారింది. మొత్తానికి దసరా వేళ మద్యం వ్యాపారం కోట్ల వర్షం కురిపించింది.






# నెస్లే,కాంప్లాన్‌కు ఝలక్

- ఎఫ్ఎస్ఎస్ఏఐ నోటీసులు!
- ప్రకటనలపై అనుమానాలు
- ఆధారాలు చూపాలని ఆదేశం

ప్రముఖ ఆహార ఉత్పత్తుల సంస్థలు నెస్లే ఇండియా, జైడస్ వెల్‌నెస్‌కు భారత ఆహార భద్రత,ప్రమాణాల ప్రాధికార సంస్థ (ఎఫ్ఎస్ఎస్ఏఐ) నోటీసులు జారీ చేసింది. కొన్ని ఉత్పత్తులపై తప్పుదారి పట్టించే ప్రచారం చేస్తున్నారనే అభ్యంతరాలతో ఈ చర్య తీసుకుంది. ప్రకటనల్లో చేస్తున్న ఆరోగ్య సంబంధిత వాదనలకు శాస్త్రీయ ఆధారాలు సమర్పించాలని ఆదేశించింది. నెస్లేకు చెందిన శిశు ఆహార ఉత్పత్తులు 'లాక్టోజెన్ ప్రో 1 పౌడర్', 'నాన్ ఎక్సెల్లా ప్రో స్టేజ్ 1'తో పాటు జైడస్ వెల్‌నెస్ ఉత్పత్తి 'కాంప్లాన్' ప్రకటనలపై నియంత్రణ సంస్థ అభ్యంతరాలు వ్యక్తం చేసింది. నిర్దిత గడువులో వివరణ ఇవ్వాలని,ఎందుకు చర్యలు తీసుకోకూడదో తెలియజేయాలని కంపెనీలను కోరింది.

### శిశు ఆహార ఉత్పత్తులపై ఆరోగ్య వాదనలకు వివరణ

'లాక్టోజెన్ ప్రో 1'లోని పాల ప్రోటీన్ అయిన వెయ్ ప్రోటీన్ సులభంగా జీర్ణమవుతుందని నెస్లే ప్రచారం చేసింది. ఈ వాదనకు శాస్త్రీయ ఆధారాలు సమర్పించాలని ఎఫ్ఎస్ఎస్ఏఐ కోరింది. 'నాన్ ఎక్సెల్లా ప్రో స్టేజ్ 1'పై ఐదు రకాల హెచ్ఎంఓల సాధారణ రోగనిరోధక వ్యవస్థకు తోడ్పడతాయని చేసిన ప్రచారంపైనా అభ్యంతరం తెలిపింది. ఈ వాదన ఉత్పత్తి రోగనిరోధక వ్యవస్థకు ప్రత్యేకంగా సహాయపడుతుందనే భావన కలిగిస్తోందని పేర్కొంది. వ్యాధుల నివారణ, ఉపశమనం, చికిత్స లేదా నిర్దిష్ట శారీరక పరిస్థితులపై ఆరోగ్య వాదనలు చేయడానికి నిబంధనల ప్రకారం అనుమతి అవసరం అని స్పష్టం చేసింది.సంబంధిత నిబంధనలకు అనుగుణంగా లేని ప్రచారాన్ని సమర్థించేందుకు ఆధారాలు ఇవ్వాలని నెస్లేను ఆదేశించింది.

### కాంప్లాన్ వృద్ధి ప్రకటనలపైనా అభ్యంతరాలు

జైడస్ వెల్‌నెస్ ఉత్పత్తి కాంప్లాన్ ప్యాకేజింగ్, ప్రకటనల్లో పిల్లల చిత్రాలతో పాటు 'రెండింతల వేగంతో ఎదుగుదల', 'ఏకాగ్రత, జ్ఞాపకశక్తికి తోడ్పాటు', '34 కీలక పోషకాలతో మెరుగైన రోగనిరోధక శక్తి' వంటి వాదనలు ఉన్నాయని ఎఫ్ఎస్ఎస్ఏఐ తెలిపింది. 'నాలుగు రుచుల్లో ఎదుగుదల' అనే ప్రచారంపైనా అభ్యంతరం వ్యక్తం చేసింది. ఈ వాదనలు ఆహార ప్రకటనలు, ఆరోగ్య వాదనలకు సంబంధించిన 2018 నిబంధనలకు విరుద్ధంగా ఉన్నట్లు ప్రాథమికంగా గుర్తించామని పేర్కొంది. వాటికి శాస్త్రీయ సమర్థన ఇవ్వాలని జైడస్‌ను ఆదేశించింది. వినియోగదారులు, ముఖ్యంగా పిల్లల తల్లిదండ్రులు,ఆహార ఉత్పత్తుల ప్రకటనలను గుడ్డిగా నమ్మకుండా వివరాలను పరిశీలించాల్సిన అవసరాన్ని ఈ పరిణామం మరోసారి గుర్తుచేస్తోంది.

# గ్లోబల్ సమ్మిట్‌లో కళావైభవం

## ప్రపంచానికి తెలంగాణ ప్రత్యేకత

- ప్రచారానికి మీడియా, సినీ ప్రముఖులు
- పెట్టుబడుల వేదికపై సాంస్కృతిక సందడి

తెలంగాణ చారిత్రక ఘనతను, సాంస్కృతిక వైభవాన్ని ప్రపంచానికి చాటిచెప్పేలా ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్-2026ను నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. డిసెంబర్ 7, 8, 9 తేదీల్లో జరగనున్న ఈ సమ్మిట్‌లో జానపద కళలు, శాస్త్రీయ సంగీతం, నృత్య ప్రదర్శనలతో పాటు రాష్ట్రంలోని విభిన్న సంప్రదాయ కళారూపాలకు ప్రాధాన్యం ఇవ్వాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. బుధవారం ఉన్నతాధికారులతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఏర్పాట్లపై సమీక్షించారు. పెట్టుబడుల అవకాశాలను పరిచయం చేయడంతో పాటు తెలంగాణ కళలు, సంస్కృతి, చారిత్రక వారసత్వాన్ని అంతర్జాతీయ ప్రతినిధులకు చాటిచెప్పాలని స్పష్టం చేశారు. ప్రారంభోత్సవానికి వచ్చే అతిథులకు ఘన స్వాగతం పలికేలా ప్రత్యేక సాంస్కృతిక కార్యక్రమాలు రూపొందించాలని సూచించారు.

### రక్షా ఎక్స్‌పోతో పాటు కల్చరల్ కార్నివాల్

సమ్మిట్‌లో భాగంగా డిసెంబర్ 7 నుంచి 9 వరకు రక్షా ఎక్స్‌పో నిర్వహించనున్నారు. చివరి రోజైన డిసెంబర్ 9న ఏర్పాటు చేయనున్న ఎయిర్ షోను వీక్షించేందుకు ప్రజలు పెద్ద సంఖ్యలో వచ్చే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో తెలంగాణ సంప్రదాయాలు,కళారూపాలను ప్రతిబింబించేలా ప్రత్యేక కల్చరల్ కార్నివాల్ నిర్వహించాలని సీఎస్ ఆదేశించారు. సమ్మిట్‌కు విస్తృత ప్రచారం కల్పించేందుకు అక్టోబర్ 24న హైదరాబాద్‌లో, అక్టోబర్ 29న న్యూఢిల్లీలో కర్టెన్ రైజర్ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఢిల్లీ, ముంబై, బెంగళూరు విమానాశ్రయాల్లో ఆకర్షణీయమైన హోర్డింగులు ఏర్పాటు చేయాలని సూచించారు. తెలంగాణ భవన్, శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్లే మార్గం, హైదరాబాద్ ప్రధాన రహదారులు,ప్రముఖ ప్రాంతాలు,స్టార్ హోటళ్ల వద్ద ప్రచార ఏర్పాట్లు వేగవంతం చేయాలని తెలిపారు.

### ప్రచారానికి మీడియా, సినీ ప్రముఖుల భాగస్వామ్యం

గ్లోబల్ సమ్మిట్, రక్షా ఎక్స్‌పో ప్రాధాన్యాన్ని దేశవ్యాప్తంగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా వేదికలను సమర్థంగా వినియోగించాలని సంజయ్ జాజు సూచించారు. సినీ ప్రముఖులు, ఇతర సెలబ్రిటీల భాగస్వామ్యంతో ప్రత్యేక షార్ట్ ఫిల్మ్‌లు రూపొందించి ప్రచారాన్ని మరింత విస్తరించాలని చెప్పారు. పెట్టుబడుల ఆకర్షణతో పాటు తెలంగాణ బ్రాండ్‌ను అంతర్జాతీయ స్థాయిలో బలోపేతం చేయడమే ఈ కార్యక్రమాల ప్రధాన ఉద్దేశమని అధికారులకు దిశానిర్దేశం చేశారు. సమీక్షలో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్, ముఖ్య కార్యదర్శి శిఖా గోయల్, కార్యదర్శులు హరిచందన, శశాంక, ముకుంద్ రెడ్డి, అజిత్ రెడ్డి, ముఖ్యమంత్రి కార్యాలయ సీపీఆర్ఓ మల్సూర్, డిజిటల్ విభాగం డైరెక్టర్ కర్రి శ్రీరామ్ సహా పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.





# వద్దు నాన్న తర్వాత

## ట్రంప్‌ను హెచ్చరించిన కొడుకు

### ఇరాన్ యుద్ధం వద్దంటూ వార్నింగ్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌తో యుద్ధంలోకి అమెరికాను తీసుకెళ్లడంపై ఆయన పెద్ద కుమారుడు డొనాల్డ్ ట్రంప్ జూనియర్ అసంతృప్తిగా ఉన్నట్లు ది అట్లాంటిక్ కథనం వెల్లడించింది. 2024 అధ్యక్ష ఎన్నికల ప్రచార సమయంలోనే అమెరికా మరోసారి మధ్యప్రాచ్య యుద్ధంలో చిక్కుకోకూడదని డాన్ జూనియర్ భావించినట్లు సమాచారం. ఇరాన్ ఇజ్రాయెల్‌పై క్షిపణులు, డ్రోన్లతో దాడులు చేసిన సమయంలో ట్రంప్ నాయకత్వాన్ని సమర్థిస్తూ ఆయన సోషల్ మీడియాలో వ్యాఖ్యలు చేశారు. అయితే, రెండున్నరేళ్ల తర్వాత అమెరికా ఇరాన్‌తో సుదీర్ఘ సైనిక ఘర్షణలోకి వెళ్లడం ఆయన గత వైఖరికి భిన్నమైన పరిణామంగా మారింది. విదేశీ యుద్ధాల కంటే అమెరికా దేశీయ సమస్యలకే ప్రాధాన్యం ఇవ్వాలన్నది డాన్ జూనియర్ అభిప్రాయంగా కథనం పేర్కొంది.

### ట్రంప్ కుటుంబంలోనే భిన్నాభిప్రాయాలు

ఇరాన్ యుద్ధంపై తన వ్యతిరేకతను డాన్ జూనియర్ తండ్రితో వ్యక్తిగత సంభాషణల్లో పలుమార్లు ప్రస్తావించినట్లు కథనం తెలిపింది. అయితే, తండ్రితో బహిరంగంగా విభేదించడానికి ఆయన ఇష్టపడటం లేదని సంబంధిత వర్గాలు వెల్లడించాయి. గతంలో యుద్ధ వ్యతిరేక వైఖరిని ప్రదర్శించిన దివంగత సంప్రదాయవాద కార్యకర్త చార్లీ కిర్క్‌తోనూ డాన్ జూనియర్‌కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. మరోవైపు, అమెరికా రాజకీయాల్లో ట్రంప్ మద్దతుదారులుగా గుర్తింపు పొందిన 'మాగా' శిబిరంలోనూ ఈ యుద్ధంపై విభేదాలు పెరుగుతున్నట్లు సమాచారం. విదేశీ యుద్ధాల్లో పాల్గొనడం దేశీయ ప్రయోజనాలకు ద్రోహమని కొందరు భావిస్తుండగా, ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ సహా కొందరు ఉన్నతాధికారులు కూడా ఘర్షణపై అంతర్గతంగా సందేహాలు వ్యక్తం చేసినట్లు కథనం పేర్కొంది.

### యుద్ధంపై అమెరికన్లలో పెరుగుతున్న వ్యతిరేకత

ఇరాన్‌పై సైనిక చర్యల విషయంలో ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు ప్రతిపాదనల సాధ్యాసాధ్యాలపై అమెరికా విదేశాంగ మంత్రి మార్కో రూబియో, సీఐఏ డైరెక్టర్ జాన్ రాట్‌క్లిఫ్ సందేహాలు వ్యక్తం చేసినట్లు నివేదిక తెలిపింది. ఇదిలా ఉండగా, ప్యూ రీసెర్చ్ సెంటర్ సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 4, 2026వరకు నిర్వహించిన సర్వేలో 65 శాతం మంది అమెరికన్లు ట్రంప్ ఇరాన్ యుద్ధ నిర్వహణను వ్యతిరేకించగా, 33 శాతం మంది మద్దతు తెలిపారు. రిపబ్లికన్లలోనూ మద్దతు మార్చిలో 69 శాతం ఉండగా, సర్వే సమయానికి 63 శాతానికి తగ్గింది. దాదాపు సగం మంది అమెరికన్లు ఈ యుద్ధం ఏడాదికి పైగా కొనసాగవచ్చని అంచనా వేశారు. తొలుత నాలుగు నుంచి ఆరు వారాల్లో ముగుస్తుందని భావించిన సైనిక చర్యలు దీర్ఘకాలిక ఘర్షణగా మారుతాయన్న ఆందోళనలు అమెరికాలో పెరుగుతున్నాయి.

# మతం మారితే ఓబీసీ రద్దే

## వెనుకబాటుతనమే కీలకమా? సుప్రీం తీర్పుతో ఫుల్ క్లారిటీ



హిందూ మతం నుంచి మరో మతంలోకి మారిన వ్యక్తికి ఓబీసీ రిజర్వేషన్ ప్రయోజనాలు కొనసాగుతాయా? అనే అంశంపై సుప్రీంకోర్టు తీర్పు దేశవ్యాప్తంగా చర్చకు తెరలేపింది. అక్టోబర్ 15న జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ శ్రీ చంద్రశేఖర్‌లతో కూడిన ధర్మాసనం ఈ అంశంపై కీలక వ్యాఖ్యలు చేసింది. హిందూ ఓబీసీ వ్యక్తి మరో మతంలోకి మారినప్పుడు, వారి సామాజిక వెనుకబాటుతనానికి మూలం ఏమిటన్నది పరిశీలించాలని స్పష్టం చేసింది. హిందూ సామాజిక వ్యవస్థలోని కుల నిర్మాణం ఆధారంగా ఏర్పడిన వెనుకబాటుతనానికి, ఇతర మతాల్లోని సామాజిక విభజనల వల్ల ఏర్పడే వెనుకబాటుతనానికి మధ్య తేడాను గుర్తించాలని ధర్మాసనం అభిప్రాయపడింది. మతం మారినంత మాత్రాన విద్యా, ఆర్థిక వెనుకబాటుతనం పూర్తిగా తొలగిపోదని అంగీకరించినప్పటికీ, రిజర్వేషన్ అర్హతను నిర్ణయించడంలో సామాజిక నేపథ్యాన్ని పరిగణనలోకి తీసుకోవాలని పేర్కొంది.

### ఓబీసీ గుర్తింపులో మతం పాత్రపై చర్చ

1992లో ఇంద్రా సాహ్నీ కేసులో వచ్చిన తీర్పు తర్వాత ఓబీసీ వర్గాల గుర్తింపునకు సామాజిక, విద్యా, ఆర్థిక వెనుకబాటుతనాన్ని ప్రాతిపదికగా తీసుకుంటున్నారు. ఇందుకోసం బాల్య వివాహాలు, శారీరక శ్రమపై ఆధారపడటం, మహిళల ఉపాధి భాగస్వామ్యం వంటి అంశాలతో పాటు ఇతర సామాజిక సూచికలను పరిశీలిస్తారు. గతంలో ఓబీసీ గుర్తింపులో వెనుకబాటుతనానికి మూలం ఏ మతంలో ఉందన్న ప్రశ్నకు ప్రత్యేక ప్రాధాన్యం ఇవ్వలేదు. తాజా తీర్పు మాత్రం హిందూ సమాజంలోని కుల వ్యవస్థను, ఇతర మతాల్లోని కుల సదృశ సామాజిక విభజనలను వేర్వేరుగా పరిశీలించింది. ఎస్సీ వర్గాల గుర్తింపులో మతపరమైన నిబంధనలు ఉన్నప్పటికీ, ఎస్టీ వర్గాల గుర్తింపులో మతం ప్రాతిపదిక కాదు. ఓబీసీ గుర్తింపు మాత్రం ఇప్పటివరకు మతతటస్థ విధానంలో కొనసాగింది. తాజా తీర్పుతో ఈ విధానం పరిధిపై చర్చ మొదలైంది.

### ఇతర మతాలకూ ఓబీసీ హోదా వర్తిస్తుంది

ఇతర మతాలకు చెందిన సముదాయాలు ఓబీసీ హోదా పొందవచ్చని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. అయితే, హిందూ మతం నుంచి మారిన వ్యక్తికి రిజర్వేషన్ కొనసాగింపును నిర్ణయించేటప్పుడు వారి వెనుకబాటుతనానికి మూలాన్ని పరిశీలించాలని పేర్కొంది. ఇంద్రా సాహ్నీ తీర్పులో వివిధ మతాల్లో సామాజిక విభజనలు ఉన్నాయని గుర్తించినప్పటికీ, తాజా తీర్పు వాటి స్వభావంలోని తేడాలపై దృష్టి పెట్టింది. మతం మారిన వ్యక్తికి విద్యా, ఆర్థిక వెనుకబాటుతనం కొనసాగుతున్నదనే ఒక్క కారణంతోనే ఓబీసీ రిజర్వేషన్ అర్హతను నిర్ణయించలేమన్నది తాజా తీర్పులోని కీలక అంశం. ఈ పరిణామం ఓబీసీ వర్గాల గుర్తింపు, మతమార్పిడి తర్వాత రిజర్వేషన్ హక్కుల కొనసాగింపు, సామాజిక న్యాయం వంటి అంశాలపై న్యాయపరమైన చర్చకు కొత్త దిశను ఇచ్చింది.

# పూర్వీకుల త్యాగస్ఫూర్తితో పనిచేయండి

- జనసంఘ్ వారసత్వమే పార్టీ బలం
- వికసిత్ భారత్ దిశగా అడుగులు
- బీజేపీ శ్రేణులకు నితిన్ నబీన్ పిలుపు!

బీజేపీ కార్యకర్తలు పూర్వ నాయకుల పోరాటాలు, త్యాగాల నుంచి స్ఫూర్తి పొందాలని పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్ పిలుపునిచ్చారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ కలలుగంటున్న 'వికసిత్ భారత్' లక్ష్య సాధనకు యువ కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు. అక్టోబర్ 21, 2026న న్యూఢిల్లీలో భారతీయ జనసంఘ్ 75వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. జనసంఘ్ సిద్ధాంతాలు, రాజకీయ వారసత్వం చూపిన మార్గంలోనే బీజేపీ ముందుకు సాగుతుందని స్పష్టం చేశారు. మారుతున్న కాలానికి అనుగుణంగా కొత్త సాంకేతికతను అందిపుచ్చుకుంటూనే పార్టీ చరిత్రను, పూర్వ నాయకుల అంకితభావాన్ని యువత గుర్తుంచుకోవాలని కోరారు.




### జనసంఘ్ పునాదులే ఆధారం

డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ, పండిట్ దీన్‌దయాళ్ ఉపాధ్యాయ వంటి నాయకులు 'దేశమే ప్రథమం', 'అంత్యోదయ' సిద్ధాంతాలతో జనసంఘ్‌కు పునాదులు వేశారని నితిన్ నబీన్ గుర్తుచేశారు. సమాజంలోని అట్టడుగు వర్గాల సంక్షేమమే అంత్యోదయ లక్ష్యమని వివరించారు. ఆ నాయకులు నాటిన సిద్ధాంతాల విత్తనం నేడు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా బీజేపీ ఎదగడానికి దోహదపడిందన్నారు. అప్పటి పాలనలో పాశ్చాత్య, వామపక్ష ఆలోచనలకు ప్రాధాన్యం పెరిగిందని, జాతీయవాద భావాలకు తగిన గుర్తింపు లేదని జనసంఘ్ ఆవిర్భావ పరిస్థితులను వివరించారు. ఈ నేపథ్యంలో శ్యామ ప్రసాద్ ముఖర్జీ కేంద్ర మంత్రివర్గానికి రాజీనామా చేసి, దేశ ప్రయోజనాల కోసం పోరాటానికి సిద్ధమయ్యారని పేర్కొన్నారు.

### జాతీయ ప్రయోజనాలే లక్ష్యం

1961లో గోవాను భారత్‌లో విలీనం చేసే అంశం నుంచి పశ్చిమ బెంగాల్‌లో హిందూ మెజారిటీ ప్రాంతాల ప్రయోజనాల పరిరక్షణ వరకు జనసంఘ్ జాతీయ ప్రయోజనాల కోసం గళమెత్తిందని నితిన్ నబీన్ తెలిపారు. పార్టీ భవిష్యత్తును నిర్మించాలంటే ప్రస్తుత తరం కార్యకర్తలు కూడా అదే నిబద్ధతతో పని చేయాలని కోరారు. చరిత్ర నుంచి పాఠాలు నేర్చుకుంటూ, కాలానుగుణ మార్పులను స్వీకరిస్తూ ప్రజాసేవకు అంకితం కావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, ఢిల్లీ బీజేపీ అధ్యక్షుడు హర్ష్ మల్హోత్రా, అసెంబ్లీ స్పీకర్ విజేందర్ గుప్తా సహా పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు. జనసంఘ్ నుంచి బీజేపీ వరకు సాగిన రాజకీయ ప్రయాణాన్ని గుర్తుచేసుకుంటూ, భవిష్యత్ తరాలకు పార్టీ సిద్ధాంతాలను చేరవేయడంపై నాయకులు దృష్టి సారించారు.



# సీజేపీ నేతలకు బెయిల్

- ఏడు రోజుల తర్వాత విడుదల
- జంతర్ మంతర్ నిరసనలపై హామీ

ఢిల్లీలో జంతర్ మంతర్ నిరసనల వ్యవహారం కీలక మలుపు తిరిగింది. కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాకు ఏడు రోజుల జైలు జీవితం తర్వాత బెయిల్ లభించింది. నిరసన స్థలానికి డీనోటిఫైడ్ హోదా కొనసాగినంత కాలం అక్కడ ఆందోళనలకు పిలుపునివ్వబోమని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడబోమని వారు కోర్టుకు హామీ ఇచ్చారు. మరో మూడు రోజుల కస్టడీ కోరిన ఢిల్లీ పోలీసుల విజ్ఞప్తిని కోర్టు తిరస్కరించింది. బారికేడ్లు దాటి నిరసన ప్రాంతంలోకి ప్రవేశించారనే ఆరోపణలతో నమోదైన కేసులను పోలీసులు క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. ఈ వ్యవహారంలో తదుపరి విచారణ అక్టోబర్ 23న జరగనుంది.

ఢిల్లీలో జంతర్ మంతర్ నిరసన ప్రాంతంలోకి ప్రవేశించిన కేసులో అరెస్టయిన కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నేతలు సౌరవ్ దాస్, ఆశుతోష్ రంకాకు ఎట్టకేలకు బెయిల్ లభించింది. ఏడు రోజుల పాటు జైలులో ఉన్న వీరిని 2026 అక్టోబర్ 21న ప్రత్యేక ఎగ్జిక్యూటివ్ మేజిస్ట్రేట్ కోర్టు విడుదల చేయాలని ఆదేశించింది. ఢిల్లీ పోలీసులు శాంతిభద్రతల సమస్యలను ప్రస్తావిస్తూ మరో మూడు రోజుల కస్టడీ కోరినా కోర్టు అంగీకరించలేదు. గతంలో తిరస్కరించిన పూచీకత్తులను తాజాగా అంగీకరించి విడుదలకు మార్గం సుగమం చేసింది.

### నిరసనలు చేయబోమని హామీ

జంతర్ మంతర్ నిరసన స్థలానికి ఉన్న డీనోటిఫైడ్ హోదా కొనసాగినంతకాలం అక్కడ ఆందోళనలకు పిలుపునివ్వబోమని దాస్, రంకా కోర్టుకు హామీ ఇచ్చారు. ప్రజా శాంతికి భంగం కలిగించే కార్యకలాపాలకు దూరంగా ఉంటామని స్పష్టం చేశారు. న్యాయవ్యవస్థపై పూర్తి విశ్వాసం ఉందని తెలిపారు. విచారణ సమయంలో సీజేపీ సభ్యుల వ్యాఖ్యలపై పోలీసులు అభ్యంతరాలు వ్యక్తం చేయగా, నేతల తరఫు న్యాయవాదులు కోర్టుకు బేషరతుగా క్షమాపణ చెప్పారు. భవిష్యత్తులో ఇలాంటి ప్రవర్తన పునరావృతం కాదని హామీ ఇచ్చారు. ఈ కేసులో తదుపరి విచారణ అక్టోబర్ 23న జరగనుంది.

### హైకోర్టులో వెనక్కి పిటిషన్

అక్టోబర్ 13న జంతర్ మంతర్ వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లను దాటి నిరసన ప్రాంతంలోకి వెళ్లారనే ఆరోపణలతో పోలీసులు దాస్, రంకాలను అదుపులోకి తీసుకున్నారు. అక్టోబర్ 14న ఐదు రోజుల జ్యుడీషియల్ కస్టడీకి పంపగా, అక్టోబర్ 19న మరో రెండు రోజులు పొడిగించారు. దీనిపై దాస్, రంకా ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించినా, బారికేడ్లు దాటడంపై న్యాయమూర్తి ప్రశ్నలు సంధించారు. నిరసనలపై అనుమతులు ప్రజా శాంతి పరిరక్షణకు అవసరమని వ్యాఖ్యానించారు. ప్రత్యేక మేజిస్ట్రేట్ నిర్ణయం కోసం వేచి ఉండాలని సూచించడంతో పిటిషన్‌ను వెనక్కి తీసుకున్నారు.

### క్రైమ్ బ్రాంచ్‌కు కేసుల బదిలీ

ఈ ఘటనకు సంబంధించి నమోదైన రెండు కేసులను ఢిల్లీ పోలీసులు అక్టోబర్ 20న క్రైమ్ బ్రాంచ్‌కు బదిలీ చేశారు. నిష్పక్షపాత దర్యాప్తు అవసరాన్ని ఇందుకు కారణంగా పేర్కొన్నారు. అక్టోబర్ 13న కన్నాట్ ప్లేస్, పార్లమెంట్ స్ట్రీట్ పోలీస్ స్టేషన్లలో నమోదైన ఎఫ్ఐఆర్‌లలో అక్రమ ప్రవేశం, నేరపూరిత కుట్ర, దాడి, ప్రభుత్వ ఉద్యోగుల విధులకు ఆటంకం కలిగించడం వంటి అభియోగాలున్నాయి. మరో కార్యకర్త అజింక్య షిండేతో పాటు దాస్, రంకాలపై శాంతిభద్రతలకు ముప్పు కలిగించే చర్యలకు సంబంధించి ముందస్తు చర్యలు చేపట్టారు. షిండే బాండ్‌పై విడుదలయ్యారు. మిగిలిన 11 మంది సభ్యులపై ఇప్పటివరకు చర్యలు తీసుకోలేదు.

# ఎస్‌బీఐ కస్టమర్ల డేటా లీక్

- పెరుగుతున్న సైబర్ మోసాలు
- డార్క్ వెబ్‌లో 3,897 ఖాతాల లీక్
- వ్యక్తిగత వివరాలతో మోసాల ముప్పు

దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ రంగ బ్యాంకు ఎస్‌బీఐలో డేటా లీక్ అనుమానాలు కలకలం రేపుతున్నాయి. డార్క్ వెబ్‌లో లభించిన సుమారు 3.75 లక్షల రికార్డులను ప్రాథమికంగా పరిశీలించగా, 3,897 రికార్డుల్లో ఖాతాదారులకు సంబంధించిన వ్యక్తిగత సమాచారం ఉన్నట్లు బ్యాంకు గుర్తించింది. అక్టోబర్ 21న స్టాక్ ఎక్స్ఛేంజీలకు ఇచ్చిన సమాచారం ప్రకారం, బాధితుల పేర్లు, లింగం, రిజిస్టర్డ్ మొబైల్ నంబర్లు, పుట్టిన తేదీలు, ఈమెయిల్ చిరునామాలు, నివాస వివరాలు బయటపడిన సమాచారంలో ఉన్నాయి. బ్రాంచ్ వివరాలు, సీఐఎఫ్ గుర్తింపు సంఖ్యలు, రుణ దరఖాస్తులకు సంబంధించిన వివరాలు కూడా ఉన్నట్లు తెలిపింది. అక్టోబర్ 16న థ్రెట్ ఇంటెలిజెన్స్ సంస్థ, డిఫెన్స్ సైబర్ ఏజెన్సీ, సీఈఆర్‌టీ-ఇన్ నుంచి హెచ్చరికలు అందడంతో బ్యాంకు దర్యాప్తు ప్రారంభించింది.




### ఖాతాలు హ్యాక్ అయ్యాయా?

### మోసగాళ్ల కొత్త వ్యూహాలు

వ్యక్తిగత సమాచారం బయటపడటం అంటే బ్యాంకు ఖాతాలు హ్యాక్ అయ్యాయని అర్థం కాదని నిపుణులు స్పష్టం చేస్తున్నారు. పాస్‌వర్డ్‌లు, పిన్‌లు, ఓటీపీలు, లావాదేవీల వివరాలు బయటపడ్డాయని ఇప్పటివరకు నిర్ధారణ కాలేదు. అయితే, కస్టమర్ల వివరాలు తెలిసిన మోసగాళ్లు బ్యాంకు సిబ్బందిగా నటిస్తూ రుణాలు, ఖాతా సమస్యల పేరుతో రహస్య సమాచారాన్ని అడిగే ప్రమాదం ఉంది. మిటిగాటా సంస్థ సహవ్యవస్థాపకుడు సార్థక్ దూబే అభిప్రాయం ప్రకారం, రుణ దరఖాస్తుల వ్యవస్థలు, కేవైసీ పత్రాలు, ఉద్యోగుల ఈమెయిళ్లు, థర్డ్ పార్టీ సంస్థల వ్యవస్థల ద్వారా కూడా సమాచారం బయటపడే అవకాశం ఉంది. డేటా ఎక్కడి నుంచి లీక్ అయింది, ఏ వ్యవస్థలో లోపం ఉంది అనేది దర్యాప్తులో తేలాల్సి ఉంది. ఈ ఘటనపై స్వతంత్ర సైబర్ భద్రతా సంస్థతో ఎస్‌బీఐ విచారణ చేపట్టింది.

### ఖాతాదారులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

కస్టమర్లు ఆందోళనతో ఖాతాలు మూసివేయాల్సిన అవసరం లేదు. అయితే, అనుమానాస్పద కాల్స్, సందేశాలు, ఈమెయిల్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలి. ఓటీపీ, ఏటీఎం పిన్, పాస్‌వర్డ్‌లను ఎవరికీ వెల్లడించకూడదు. లావాదేవీల అలర్ట్‌లను అందుబాటులో ఉంచి, ఖాతా వివరాలను తరచూ పరిశీలించాలి. అధికారిక ఎస్‌బీఐ యాప్, వెబ్‌సైట్ ద్వారానే బ్యాంకును సంప్రదించాలి. గుర్తు తెలియని లింకులను తెరవకూడదు. తమ అనుమతి లేకుండా రుణాలు, క్రెడిట్ కార్డులు తెరిచారా అనే విషయాన్ని క్రెడిట్ నివేదికలో పరిశీలించాలి. అవసరమైతే యూఐడీఏఐ అధికారిక మార్గాల్లో ఆధార్ బయోమెట్రిక్స్‌ను లాక్ చేసుకోవచ్చు. అనుమానాస్పద లావాదేవీలు కనిపిస్తే వెంటనే బ్యాంకుకు తెలియజేయాలి. సైబర్ మోసానికి గురైతే 1930 హెల్ప్‌లైన్‌కు కాల్ చేయాలి లేదా cybercrime.gov.inలో ఫిర్యాదు చేయాలి. ప్రస్తుతం బ్యాంకు కార్యకలాపాలకు గణనీయమైన అంతరాయం లేదని ఎస్‌బీఐ వెల్లడించింది. దర్యాప్తు పూర్తయ్యాక డేటా లీక్ మూలం, ప్రభావిత కస్టమర్ల వివరాలపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది.



# టీవీ ఛానళ్లకు కేంద్రం హెచ్చరిక

- విద్వేష ప్రసారాలపై కఠిన చర్యలు!
- ప్రసార నియమాలు పాటించాల్సిందే
- రెచ్చగొట్టే వ్యాఖ్యలకు మూల్యం తప్పదు

టీవీ వార్తా ఛానళ్ల ప్రసారాలపై కేంద్ర సమాచార ప్రసార మంత్రిత్వ శాఖ కీలక హెచ్చరికలు జారీ చేసింది. కార్యక్రమాల ద్వారా మత విద్వేషాలు, సామాజిక విభేదాలు, దేశ వ్యతిరేక వైఖరులు ప్రోత్సహించేలా వ్యవహరించకూడదని స్పష్టం చేసింది. కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్స్ నియంత్రణ చట్టం, సంబంధిత నిబంధనల్లోని ప్రోగ్రామ్ కోడ్‌ను తప్పనిసరిగా పాటించాలని ఆదేశించింది. కొన్ని ప్రసారాల్లో అనుచిత ప్రవర్తన, అభ్యంతరకర భాష కనిపిస్తున్నట్లు అంతర్‌శాఖ కమిటీ గుర్తించిందని తెలిపింది. ఇటువంటి ప్రవర్తనను సాధారణమైనదిగా చూపించే ప్రయత్నాలను అంగీకరించబోమని స్పష్టం చేసింది.

### సంచలనాలకు దూరంగా.. వాస్తవాలకే ప్రాధాన్యం

నేరాలు, హింస, ప్రమాదాలు, ప్రకృతి విపత్తులకు సంబంధించిన వార్తలను ప్రసారం చేసేటప్పుడు ఛానళ్లు అప్రమత్తంగా ఉండాలని సూచించింది. ధ్రువీకరించిన సమాచారం, నిజాయతీ, సమతుల్యతతో కూడిన వార్తలకే ప్రాధాన్యం ఇవ్వాలంది. తప్పుడు ప్రచారం, అర్ధసత్యాలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు, భయాందోళనలు కలిగించే దృశ్యాలను పదేపదే ప్రసారం చేయకూడదంది. అవసరమైన చోట దృశ్యాలకు బ్లర్ చేయడం, గుర్తింపు వివరాలను దాచడం వంటి చర్యలు తీసుకోవాలి. మహిళలు, పిల్లలపై నేరాలకు సంబంధించిన దృశ్యాల విషయంలో మరింత జాగ్రత్త వహించాలని మంత్రిత్వ శాఖ సూచించింది.

### ఉగ్రవాద ఆపరేషన్ల ప్రత్యక్ష ప్రసారంపై ఆంక్షలు

భద్రతా దళాలు నిర్వహించే ఉగ్రవాద వ్యతిరేక ఆపరేషన్ల ప్రత్యక్ష ప్రసారానికి అనుమతి లేదని స్పష్టం చేసింది. ఆపరేషన్ ముగిసే వరకు అధీకృత అధికారి ఇచ్చే సమాచారానికే వార్తల ప్రసారాన్ని పరిమితం చేయాలంది. అవసరమైన సందర్భాల్లో పాత దృశ్యాలకు తేదీ, సమయం స్పష్టంగా చూపించాలని సూచించింది. భారతదేశానికి సంబంధించిన మ్యాప్‌లు, గ్రాఫిక్స్‌లో సర్వే ఆఫ్ ఇండియా ప్రచురించిన అధికారిక మ్యాప్‌లనే ఉపయోగించాలని పేర్కొంది. చర్చా కార్యక్రమాల్లో పాల్గొనేవారి ఎంపికపై సంపాదకులు నియంత్రణ కలిగి ఉండాలని తెలిపింది.

### ఏఐ వినియోగంపై బాధ్యత.. ఉల్లంఘిస్తే చర్యలు

వార్తల తయారీలో ఏఐ వినియోగం సహాయక సాధనంగానే ఉండాలని కేంద్రం సూచించింది. దాని వల్ల వార్తల కచ్చితత్వం, విశ్వసనీయత, సున్నితత్వం దెబ్బతినకూడదు. చర్చల్లో అభ్యంతరకర వ్యాఖ్యలు వచ్చినప్పుడు వెంటనే మ్యూట్ చేయడం, హెచ్చరికలు ఇవ్వడం, ప్రసారాన్ని నిలిపివేయడం వంటి చర్యలు తీసుకోవాలంది. లైంగిక నేరాల బాధితుల పేర్లు, ఫొటోలు, కుటుంబ వివరాలు, ప్రాంతం వంటి గుర్తింపు సమాచారాన్ని ప్రత్యక్షంగా లేదా పరోక్షంగా వెల్లడించకూడదంది. వార్తల సేకరణ నుంచి ప్రసారం వరకు పనిచేసే సిబ్బందికి శిక్షణ ఇవ్వాలని సూచించింది. నిబంధనలు ఉల్లంఘిస్తే కేబుల్ టెలివిజన్ నెట్‌వర్క్స్ నియంత్రణ చట్టం కింద చర్యలు తప్పవని

# టీడీపీకి గుడ్‌బై.. వైసీపీలోకి గుండా లక్ష్మీదేవి!

**శ్రీకాకుళం మేయర్ అభ్యర్థిగా బరిలోకి?**

**జగన్ సమక్షంలో నేడు పార్టీలో చేరిక!**



శ్రీకాకుళం రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకోనుంది. మాజీ టీడీపీ ఎమ్మెల్యే గుండా లక్ష్మీదేవి తన అనుచరులతో కలిసి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరేందుకు సిద్ధమ య్యారు. నేడు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమక్షంలో ఆమె వైసీపీ కండువా కప్పుకోనున్నట్లు సమాచారం. శ్రీకాకుళం మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు మరో రెండు నెలల్లో జరిగే అవకాశం ఉంది. న్యాయపరమైన అంశాల కారణంగా ఎన్నికల ప్రక్రియ ఆలస్యమవుతోంది. ఈ నేపథ్యంలో గుండా లక్ష్మీదేవిని వైసీపీ మేయర్ అభ్యర్థిగా బరిలోకి దింపే అవకాశం ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. అయితే దీనిపై పార్టీ అధికారిక ప్రకటన వెలువడాల్సి ఉంది.ధర్మాన ఆహ్వానంతో పార్టీ మార్పుగుండా లక్ష్మీదేవికి శ్రీకాకుళం రాజకీయాల్లో ప్రత్యేక గుర్తింపు ఉంది. 2004, 2009 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థి గుండా అప్పల సూర్యనారాయణపై ధర్మాన ప్రసాదరావు విజయం సాధించారు. 2014 ఎన్నికల్లో ధర్మానను ఓడించి లక్ష్మీదేవి ఎమ్మెల్యేగా గెలిచారు. అయితే 2019 ఎన్నికల్లో ఆమెపై ధర్మాన ప్రసాదరావు విజయం సాధించారు. తాజాగా ధర్మాన ఆహ్వానం మేరకు వైసీపీలో చేరాలని ఆమె నిర్ణయించుకున్నట్లు సమాచారం. 2024 అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ గుండా లక్ష్మీదేవికి టికెట్ ఇవ్వలేదు. ఏడాది క్రితం ఆమె భర్త గుండా సూర్యనారా యణ మరణించారు. ఇటీవల శ్రీకాకుళం మేయర్ పదవికి కూడా ఆమెకు టీడీపీ టికెట్ ఇచ్చే అవకాశం లేదనే సంకేతాలు వెలువడ్డాయి.దీంతో తనకు నమ్మకంగా ఉన్న నాయకులతో చర్చించిన లక్ష్మీదేవి పార్టీ మారాలని నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. గుండా లక్ష్మీదేవి వైసీపీలో చేరితే శ్రీకాకుళం జిల్లా రాజకీయాల్లో కొత్త సమీకరణాలు ఏర్పడే అవకాశం ఉంది.

# వైసీపీ నామినేషన్లకు అడ్డంకులు: రాచమల్లు



కడప జిల్లా ప్రొద్దుటూరులో స్థానిక సంస్థల ఎన్నికల వేళ రాజకీయ వివాదం ముదిరింది. వైసీపీ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేయకుండా టీడీపీ అడ్డంకులు సృష్టిస్తోందని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి ఆరో పించారు. జిల్లాలోని 30 పంచాయతీల్లో సర్పంచ్ అభ్యర్థులకు, 33 ఎంపీటీసీ స్థానాల్లో పోటీ చేయాలనుకునే వైసీపీ అభ్యర్థులకు పంచాయతీ కార్యదర్శులు నో డ్యూ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని విమర్శించారు. అవసరమైన పత్రాలు అందకుండా చేసి అభ్యర్థులను ఎన్నికల బరి నుంచి తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ నామినేషన్లు వేసేందుకు వెళ్లకుండా తమ పార్టీ నాయకు లను పోలీసులు హౌస్ అరెస్టులు చేస్తున్నా రని ఆరోపించారు. అభ్యర్థులను బెదిరిస్తూ పోటీకి దూరం చేసే ప్రయత్నాలు జరుగు తున్నాయని మండిపడ్డారు. కౌన్సిలర్ ఎన్నికల సమయంలోనూ ఇలాంటి పరిస్థి తులు ఎదురయ్యాయని విమర్శించారు. ఎన్నికల్లో పోటీ చేయడం ప్రతి అభ్యర్థి హక్కు అని స్పష్టం చేస్తూ, అధికారులు నిష్పక్షపాతంగా వ్యవహరించి ప్రజాస్వామ్యబద్ధంగా ఎన్నికలు జరిగేలా చూడాలని రాచమల్లు కోరారు.

# ప్రొద్దుటూరును ఫ్యాక్షన్ పట్టణంగా మార్చొద్దు!



ప్రొద్దుటూరులో రాజకీయ వ్యాఖ్యలతో ఉద్రిక్తతలు పెంచవద్దని మాజీ ఎమ్మెల్యే రాచమల్లు శివప్ర సాద్ రెడ్డికి షేక్ వెల్ఫేర్ కార్పొరేషన్ రాష్ట్ర చైర్మన్ ముక్తియార్ హెచ్చరిం చారు. ప్రశాంతంగా ఉన్న పట్టణంలో రాజకీయ ప్రయోజనాల కోసం ఫ్యాక్షన్ వాతావరణం సృష్టించే ప్రయత్నాలు మానుకోవాలని సూచించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో 2021 ఎన్నికల నిర్వహణ, తన అరెస్టు, పోలీసు బందోబస్తు అంశాలను ప్రస్తావిస్తూ రాచమల్లు వ్యాఖ్యలను ప్రశ్నించారు. గత ప్రభుత్వ కాలంలో అవినీతి, అక్రమాలు జరగలేదా అని నిలదీస్తూ, ఇతరులపై ఆరోపణలు చేసే ముందు ఆత్మపరిశీలన చేసు కోవాలని హితవు పలికారు. ప్రొద్దుటూరు, పులివెందు లలో డబ్బులు పంపిణీ చేశారన్న ఆరోపణలపై రాచమల్లు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల అధి కారులు, సిబ్బంది, కలెక్టర్ పై రాచమల్లు చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో పోలీసు సూపరింటెండెంట్ కు ఫిర్యాదు చేస్తామని వెల్లడించారు. ప్రజల్లో భయాందోళ నలు సృష్టించే వ్యాఖ్యలకు రాజకీయ నాయకులు దూరంగా ఉండాలని, పట్టణంలో శాంతిభద్రతలు కాపా డేందుకు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ముక్తియార్ కోరారు.

# జాతీయ సరస్ మేళాలో రూ.7 కోట్ల వ్యాపారం




విజయవాడలోని పున్నమి ఘాట్‌లో అక్టోబర్ 13 నుంచి 31 వరకు నిర్వహి స్తున్న జాతీయ సరస్ మేళా మహిళా సంఘాల ఉత్పత్తులకు మంచి మార్కెట్‌గా నిలుస్తోంది. ఇప్పటివరకు సుమారు రూ.7 కోట్ల వ్యాపారం జరిగినట్లు ఎన్టీఆర్ జిల్లా డీఆర్డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ ఏ.ఎన్.వి. నాంచా రరావు తెలిపారు. దేశవ్యాప్తంగా స్వయం సహాయక సంఘాల మహిళలు, చేతివృ త్తుల కళాకారులు పాల్గొంటున్న ఈ మేళాలో మొత్తం 587 స్టాళ్లు ఏర్పాటు చేయగా, ఆంధ్రప్రదేశ్ సంఘాలకు 210 స్టాళ్లు కేటాయించారు. హస్తకళలు, చేనేత వస్త్రాలు, ఆహార ఉత్పత్తులు సందర్శకులను ఆకట్టుకుం టున్నాయి. వివిధ రాష్ట్రాల సంప్రదాయ రుచుల కోసం కుదుంబశ్రీ ఆధ్వర్యంలో 50 స్టాళ్లతో ప్రత్యేక ఫుడ్‌కోర్టు ఏర్పాటు చేశారు. జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ మేళాను పరిశీలించి, వికయదారులు, వినియోగదారుల అభిప్రా యాలు తెలుసుకున్నారు. మొబైల్ ఏటీఎంలు, పారిశుధ్యం, తాగునీరు, భద్రతా ఏర్పాట్లను సమీక్షిం చారు. ప్రవేశం ఉచితమని, రోజూ సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలు ఉంటాయని అధికారులు తెలిపారు. కుటుంబాలతో మేళాను సందర్శించి మహిళల ఉత్పత్తులు కొనుగోలు చేయాలని, వారి ఆర్థిక స్వావలంబనకు తోడ్పడాలని పిలుపునిచ్చారు.

# వేంపల్లిలో నామినేషన్ల వేళ రాజకీయ రగడ



కడప జిల్లా వేంపల్లిలో స్థానిక సంస్థల ఎన్నికల నామినేషన్ల తొలిరోజే రాజకీయ ఉద్రిక్తత నెలకొంది. మండ లంలోని 18 ఎంపీటీసీ స్థానాల్లో 15 స్థానాలకు టీడీపీ, బీజేపీ, జనసేన కూటమి అభ్యర్థులు 22 నామినేషన్లు దాఖలు చేసినట్లు సమాచారం. మిగిలిన మూడు స్థానాలకు ఎవరూ నామినేషన్లు వేయలేదు. తమ పార్టీ అభ్యర్థులకు నామినేషన్లు సమర్పించే అవకాశం కల్పించకుండా అడ్డుకు న్నారని వైసీపీ నేతలు ఆరోపించారు. బిడాలమిట్టలోని ఎంపీడీవో కార్యాలయం వద్ద కూటమి నాయకులు పెద్ద సంఖ్యలో ఉండటంతో వివాదం చెలరేగింది. వైసీపీ మాజీ ప్రజాప్రతి నిధులు, పార్టీ నాయకులు ర్యాలీగా కార్యాలయం వద్దకు చేరుకోగా, సీఐ నరసింహులు వారిని అడ్డుకున్నారు. 144 సెక్షన్, పోలీసు చట్టంలోని 30వ సెక్షన్ అమల్లో ఉన్నాయని తెలిపారు. నిబంధనలు అందరికీ సమానంగా వర్తింపజేయాలని వైసీపీ నేతలు డిమాండ్ చేశారు. చివరకు ఉన్నతాధికారులతో మాట్లాడి గురువారం నామినేషన్లకు అవకాశం కల్పించేలా చూస్తామని సీఐ హామీ ఇవ్వడంతో వారు వెనుదిరిగారు. ఆరోపణలపై అధికారుల స్పష్టత రావాల్సి ఉండగా, తదుపరి ప్రక్రియపై ఉత్కంఠ నెలకొంది.

# మానవ సేవే.. మాధవ సేవ!

**ఉద్యోగి ప్రాణాలకు భరోసా...**

**ఆపదలో, కొండంత ధైర్యంగా!**

**ఆపద్బాంధవుడిగా బిగ్ టీవీ ఛైర్మన్ విజయ్ కుమార్ రెడ్డి!**
**రూ.12 లక్షల తక్షణ సాయంతో ప్రాణం పోసిన మానవత్వం**



ఒక ఉద్యోగి కష్టంలో ఉన్నప్పుడు యాజ మాన్యం స్పందించడం ఒక బాధ్యత.. కానీ ప్రాణాపాయంలో ఉన్నప్పుడు అండగా నిలబడి, చికిత్సకు అవసరమైన నిధులను క్షణాల్లో సమకూర్చడం మానవత్వానికి నిలువెత్తు నిదర్శనం! ఢిల్లీలో బిగ్ టీవీ రిపోర్టర్ శివకు బ్రెయిన్ స్ట్రోక్ రావడంతో కుటుంబం ఒక్కసారిగా ఆందోళనలో మునిగిపోయింది. ఎడమ చేయి, ఎడమ కాలు కదలకపోవడంతో పరిస్థితి విషమిం చింది. ఆ సమయంలో సహచర జర్నలి స్టులు గోపి, రాజు, సూర్యకిరణ్ వెంటనే స్పందించి శివను ఆస్పత్రికి తరలించారు. ప్రాణాలు నిలబెట్టేందుకు అత్యవసర చికిత్స అవసరమైన వేళ.. డబ్బు ఎక్కడి నుంచి తేవాలన్న ఆందోళన కుటుంబాన్ని వెంటాడింది.

**నిమిషాలే కీలకం.. 12 లక్షలతో భరోసా!**

వైద్యులు తక్షణమే ఆపరేషన్ చేయాలని, ముందుగా భారీ మొత్తం చెల్లించాలని చెప్పడంతో విషయం బిగ్ టీవీ యాజమాన్యం దృష్టికి వెళ్లింది. అంతే.. ఛైర్మన్ విజయ్ కుమార్ రెడ్డి వెంటనే స్పందించారు. చికిత్సకు అవసరమైన రూ.12 లక్షలను సమకూర్చి, ఆపరేషన్ కు మార్గం సుగమం చేశారు. ఆ సమయంలో ఆయన అందించిన సహాయం కేవలం డబ్బు కాదు.. ప్రాణాపా యంలో ఉన్న ఓ ఉద్యోగికి అందించిన ధైర్యం, ఓ కుటుంబానికి కల్పించిన ఆశ! ఆపరేషన్ పూర్తయిన అనంతరం శివకు ప్రస్తుతం ప్రాణాపాయం లేదని వైద్యులు తెలిపినట్లు సమాచారం. మరో 48 గంటలు పర్యవేక్షణలో ఉంచి, తదుపరి పరీక్షల ఆధారంగా చికిత్స కొనసాగించ నున్నారు.

**ఇదే కదా మానవసేవ..**
**ఇదే నిజమైన నాయకత్వం!**

ఉద్యోగి విధుల్లో ఉన్నప్పుడు పనిని ఆశించడం ఒక ఎత్తు.. అదే ఉద్యోగి ప్రాణాలతో పోరాడుతున్నప్పుడు అతని వెనుక నిలబడటం మరో ఎత్తు. విజయ్ కుమార్ రెడ్డి స్పందనలో కనిపించింది ఈ రెండో కోణం. సంస్థలో పనిచేసే వ్యక్తిని కేవలం ఉద్యోగిగా కాకుండా, ఆపదలో ఆదుకోవాల్సిన మనిషిగా చూడటం గొప్ప విలువ. సమయం మించితే ప్రమాదం పెరిగే వేళ.. ఆర్థిక సహాయంతో ముందుకొచ్చి చికిత్సకు తోడ్పడటం అభి నందనీయం. సహచర జర్నలిస్టుల మానవీయ స్పందనకు తోడు ఛైర్మన్ అందించిన సాయం శివ కుటుంబానికి కొండంత అండగా నిలిచింది. మాటలతో సానుభూతి చూపేవారు ఎందరో ఉంటారు.. అవసరమైన వేళ చేతలతో అండగా నిలిచేవారే నిజమైన ఆపద్బాంధ వులు. ఉద్యోగి కష్టాన్ని తన బాధ్యతగా భావించి స్పందించిన విజయ్ కుమార్ రెడ్డి చర్యే మానవసేవకు అసలైన అర్థం!




# విద్యుత్ బస్సుల ప్రైవేటీకరణ ఆపాలి

విజయవాడలో ఏపీఎస్ఆర్టీసీ విద్యుత్ బస్సుల నిర్వహణను ప్రైవేట్ ఆపరేటర్లకు అప్పగించే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ డిమాండ్ చేసింది. ఆర్టీసీ జేఏసీ చేపడుతున్న ఉద్యమాలకు సంపూర్ణ మద్దతు ప్రకటించింది. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు దాసరి కిరణ్ కుమార్, ప్రధాన కార్యదర్శి టి. గంగాంజనేయులు మాట్లాడుతూ..విద్యుత్ బస్సుల నిర్వహణ ప్రైవేటీకరణతో పాటు డిపోలను ఖాళీ చేయించి విలువైన స్థలాలను లీజుల పేరుతో ప్రైవేట్ వ్యక్తులకు అప్పగించే చర్యలు సంస్థ ప్రయోజనాలకు విఘాతం కలిగిస్తాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ నిర్ణయాలు వేలాది మంది ఔట్‌సోర్సింగ్ కార్మికుల ఉద్యోగ భద్రతను దెబ్బతీసే ప్రమాదం ఉందన్నారు. ఏళ్లుగా సేవలందిస్తున్న కార్మికుల వేతనాలు, ఇతర సమస్య లను పరిష్కరించి, భవిష్యత్తుకు భరోసా కల్పించాలని కోరారు.నిరసనలో భాగంగా అక్టోబర్ 22, 23 తేదీల్లో కార్మికు లంతా సల్లబ్యాడ్జీలు ధరించి విధులకు హాజరుకావాలని పిలు పునిచ్చారు. ప్రజా రవాణా వ్యవస్థను కాపాడుతూ ఉద్యోగుల హక్కులను పరిరక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఆర్టీసీ జేఏసీ చేపడుతున్న ఉద్యమాలకు సంపూర్ణ మద్దతు ప్రకటిం చింది.



# మూడు గంటలకే పైడితల్లి సిరిమానోత్సవం ప్రారంభం

విజయనగరంలో ఈ నెల 27న జరిగే శ్రీ పైడితల్లి అమ్మవారి సిరిమానోత్స వాన్ని మధ్యాహ్నం 3 గంటలకు ప్రారంభించి, సాయంత్రం 5 గంటల్లోపు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి అధికా రులను ఆదేశించారు. మరుసటి రోజు మున్సిపల్ ఎన్నికలు, తుఫాను హెచ్చరి కల నేపథ్యంలో సంప్రదాయాలకు విఘాతం కలగకుండా ఉత్సవాన్ని త్వరగా ముగించాలని సూచించారు. భక్తుల రాకపోకలకు బస్సులు, తాగునీరు, మరుగుదొడ్లు, వైద్య శిబిరాలు, పారిశుధ్య ఏర్పాట్లు పటిష్ఠంగా చేయాలని స్పష్టం చేశారు. ఆలయం పరిసరాల్లో ఖాళీ స్థలాలను చదును చేసి కార్పెట్ వేయాలని, ప్రసాదం సరిపడా సిద్ధం చేయాలని కోరారు. ఎస్పీ ఏఆర్ దామోదర్ మాట్లాడుతూ సుమారు 3.5 లక్షల మంది భక్తులు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. మూడు అంచెల బారికే డింగ్ తో భద్రత కల్పించాలని సూచించారు. పండుగ, ఎన్నికల నేపథ్యంలో అక్టోబర్ 27 నుంచి 30 వరకు మద్యం దుకాణాలు, బార్లు మూసివేయాలని కలెక్టర్ ఆదేశించారు. అధికారులు సమన్వయంతో పనిచేసి ఉత్సవాన్ని ప్రశాంతంగా నిర్వహించా లని సూచించారు.

# బాధితులకు భరోసా.. నేరస్తులకు భయం!



పోలీసు అమరవీరుల సంస్మరణ దినం సందర్భంగా అమరావతిలో నిర్వహించిన కార్యక మంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు విధి నిర్వహణలో ప్రాణత్యాగం చేసిన పోలీసులకు నివా ళులర్పించారు. ప్రజల రక్షణ కోసం అమరవీరులు చేసిన త్యాగాలు మరువలేనివని పేర్కొన్నారు. బాధి తులకు పోలీసులపై నమ్మకం కలగాలని, నేరస్తు లకు ఖాకీ అంటే భయం ఉండాలని స్పష్టం చేశారు. 1959 అక్టోబర్ 21న లడఖ్‌లో చైనా సైనికుల దాడిలో పది మంది పోలీసులు వీరమ రణం పొందిన ఘటనను గుర్తుచేశారు. శాంతిభద్రతలు పటిష్ఠంగా ఉంటేనే పెట్టుబడులు, పరిశ్రమలు, ఉపాధి అవకాశాలు పెరుగుతాయని తెలిపారు. రాజకీయ ముసుగులో జరిగే నేరాలను సహించకూడదని, రౌడీయిజం, సామాజిక మాధ్యమాల వేధింపులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సైబర్ నేరాలను అరికట్టేందుకు పోలీసులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సీసీ కెమెరాలు, డ్రోన్లు, డేటా విశ్లేషణ, కృత్రిమ మేధ సాయంతో నేరాల నియంత్రణ, దర్యాప్తును ఆధునికీకరించాలని పిలుపునిచ్చారు. నేరం జరిగిన తర్వాత ఛేదించడం కంటే, ముందే నివారించడమే ఉత్తమ పోలీసింగ్ అని చంద్రబాబు పేర్కొన్నారు.

# నిత్యావసరాల ధరలు తగ్గించండి

**అధికారులకు చంద్రబాబు ఆదేశం**

అమరావతిలో నిర్వహించిన ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రజలకు ఉపశమనం కలిగించేలా కీలక ఆదేశాలు జారీ చేశారు. ఎల్‌నినో ప్రభావంతో ధరలు పెరిగే పరిస్థితులు ఉన్నందున బియ్యం, కందిపప్పు, ఉల్లిపాయలు, పంటనూనె, పంచదార ధరలు నియంత్రించాలని అధికా రులను ఆదేశించారు. రైతుబజార్లలో తక్కువ ధరకు బియ్యం విక్రయాలకు ప్రజల నుంచి మంచి స్పందన వస్తోందని అధికారులు వివరించగా, దీపావళి, సంక్రాంతి పండుగల సమయంలోనూ నాణ్యమైన బియ్యం అందుబాటులో ఉంచే అంశాన్ని పరిశీలించాలని సీఎం సూచించారు. ఉల్లిపాయల సరఫరా పెంచాలని, విద్యుత్ సరఫరాలో అంతరాయాలు లేకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. పీఎం సూర్యఘర్ పథకం కింద మరో తొమ్మిది లక్షల ఇళ్లకు సోలార్ కనెక్షన్లు ఏర్పాటు చేసి, జాతీయ స్థాయిలో నాలుగో స్థానాన్ని మెరు గుపరుచుకోవాలని లక్ష్యంగా నిర్దేశించారు. ఇసుక సరఫరాలో ఇబ్బందులు నివారిస్తూ, సాంకేతికత వినియోగం, శాఖల మధ్య సమన్వయంతో పాలనను మరింత సమర్థంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. సీఎస్ సాయి ప్రసాద్ సహా ఉన్నతాధి కారులు సమావేశంలో పాల్గొన్నారు.

# మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి




ప్రొద్దుటూరులో 24 ఎంపీటీసీ స్థానాలకు నామినేషన్లు నిల్కడప జిల్లా ప్రొద్దుటూరు మండలంలో ఎంపీటీసీ ఎన్నికల నామినేషన్ల తొలిరోజు ఒక్క అభ్యర్థి కూడా నామినేషన్ దాఖలు చేయలేదు. మండల పరిధిలోని 24 ఎంపీటీసీ స్థానాలకు బుధవారం నుంచి నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైనప్పటికీ, ఎవరూ ముందుకు రాకపోవడం చర్చనీయాంశంగా మారింది. ప్రొద్దుటూరు మండల పరిషత్ కార్యాల యంలో ఎన్నికల అధికారులు నామినేషన్లు స్వీకరించేం దుకు ఏర్పాట్లు చేశారు.మరోవైపు,ఎన్నికల సమయంలో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పోలీసులు ముందస్తు భద్రతా చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా వైసీపీ, టీడీపీలకు చెందిన పలువురు కీలక నాయకులను హౌస్ అరెస్టు చేశారు. దీంతో మండలంలో రాజకీయ వాతావరణం ఆసక్తికరంగా మారింది. ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనా తొలిరోజు నామినేషన్లు దాఖలు కాకపోవడానికి గల కారణాలపై చర్చ జరుగుతోంది. రానున్న రోజుల్లో అభ్యర్థులు నామినే షన్లు వేస్తారా, ఎన్నికల పోటీ ఎలా ఉండబోతోందనే అంశాలపై రాజకీయ వర్గాల్లో ఉత్కంఠ నెలకొంది.

# నామినేషన్ ఉపసంహరణపై రాజకీయ దుమారం



అమలాపురం మున్సిపాలిటీలో 25వ వార్డు వైసీపీ అభ్యర్థి నామినేషన్ ఉపసంహరణ వ్యవహారం రాజకీయ వివాదానికి దారితీసింది. టీడీపీ నాయకులు, పోలీసులు ఒత్తిడి తెచ్చి అభ్యర్థితో నామినేషన్ ఉపసంహరింపజేశా రని మాజీ మంత్రి పినిపే విశ్వరూప్ ఆరోపించారు. ఎన్నికల ప్రక్రియలో అధికారుల వ్యవహారశైలి ఏకప క్షంగా ఉందని విమర్శిస్తూ, ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. అభ్యర్థులపై ఒత్తిడి తీసుకురావడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు.
ఈ ఆరోపణలను మాజీ మున్సిపల్ చైర్మన్ చిక్కాల గణేష్ ఖండించారు. 25వ వార్డు అభ్యర్థి ఎలాంటి బలవంతం లేకుండానే స్వచ్ఛందంగా నామినేషన్ ఉపసంహరించు కున్నారని స్పష్టం చేశారు. అభ్యర్థి నేరుగా వెళ్లి నిబంధ నల ప్రకారం ప్రక్రియ పూర్తి చేశారని తెలిపారు. పోలీసులపై, టీడీపీ నేతలపై చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. ఇరువర్గాలు పరస్పర విరు ద్ధమైన వాదనలు వినిపించడంతో అమలాపు రంలో రాజకీయ వేడి పెరిగింది. నామినేషన్ ఉపసంహరణ వెనుక వాస్తవాలపై స్పష్టత రావాల్సి ఉంది.



# ఎన్నికలకు యంత్రాంగం సర్వసన్నద్ధం

